ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 31.0 | కనిష్ఠం : 23.0

ANDHRAJYOTHY

5

మహబూబ్‌నగర్

జిల్లా వార్తలు

శుక్రవారం 7 నవంబరు 2025

సత్తా చాటిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

● నేషనల్ క్రికెట్ లీగ్‌కు ముగ్గురి ఎంపిక 7

తీరనున్న ఉపాధ్యాయుల కొరత

● నారాయణపేట జిల్లాలో 320 మంది బోధకుల నియామకానికి గ్రీన్ సిగ్నల్ 7



దామరగిద్ద మండలం దేశాయపల్లిలో ట్రాక్టర్‌తో వేస్తున్న వేరుశనగ విత్తనాలు

యాసంగి సాగుకు.. ప్రణాళిక

● నారాయణపేట జిల్లాలో 1.82 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని అంచనా

● అధికంగా వరి, ఆ తరువాత వేరుశనగ వేసే అవకాశం

● పంటల సాగుకు కలిసిరానున్న అధిక వర్షాలు

నారాయణపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా వ్యాప్తంగా యాసంగి పంటల సాగుకు వ్యవసాయశాఖ అధికారులు ప్రణాళికను సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా 1.82 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కానున్నాయని వారు చెబుతున్నారు. ఈ సారి వర్షాకాలంలో అధిక వర్షాలు కురవడంతో భూగర్భ జలాలు పెరిగాయి. సంగంబండ, భూత్పూర్ రిజర్వాయర్‌లతో పాటు జిల్లాలోని చెరువులు, కుంటల కింద సాగుకు కలిసిరానుంది.

1.70 లక్షల ఎకరాల్లో వరి

జిల్లాలో యాసంగిలో ప్రధానంగా వరి, వేరుశనగ, తెల్ల జొన్న పంటలు సాగు చేస్తారు. ప్రస్తుతం వేరుశనగ సాగు చేస్తుండగా, జొన్న పంట కోసం పొలాలను చదును చేస్తున్నారు. యాసంగి సాగు లక్ష్యం 1.82 లక్షల ఎకరాలకు గాను వరి 1.70 లక్షల ఎకరాల్లో సాగు చేయనుండగా, వేరుశనగ 8,000 ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేశారు. తర్వాత తెల్ల జొన్నలు 1,400 ఎకరాల్లో, గుర్రం శనగలు 120, అలసందలు 300, కూరగాయలు 800 ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉంది.

16,000 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం

1.82 లక్షల ఎకరాల్లో పంటల సాగుకు గాను యూరియా 16,000 మెట్రిక్ టన్నులు, డీఏపీ 9,000 మెట్రిక్ టన్నులు అవసరం ఉన్నట్లు గుర్తించారు. ఆ తరువాత కాంప్లెక్స్ ఎరువులు 15,000, ఎస్ఎస్‌పీ సూపర్ పాస్పెట్ 600, ఎంఓపీ మ్యురెట్ ఆఫ్ పొటాష్ 800 మెట్రిక్ టన్నులు అవసరం ఉన్నట్లు గుర్తించారు. విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచుతామని వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ తెలిపారు. అధీకృత డీలర్ల నుంచే విత్తనాలు, ఎరువులు కొనాలని, రశీదులు తీసుకోవాలని చెబుతున్నారు.

నెత్తుటేరులు

జిల్లాలోని రహదారులపై తరచూ ప్రమాదాలు

● 10 నెలల్లో 211 మంది మృత్యువాత..

● 423 మంది క్షతగాత్రులు

● బ్లాక్ స్పాట్‌లలోనే ఎక్కువ యాక్సిడెంట్లు

● జడ్చర్ల పీఎస్ పరిధిలో 44.. రూరల్ పరిధిలో 30 మరణాలు

● అధిక వేగం.. రాష్ డ్రైవింగే కారణం

మహబూబ్‌నగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రహదారులపై మరణ మృదంగం వినిపిస్తోంది. రోజూ ఎక్కడో ఒకచోట రహదారులు రక్తసిక్తం అవుతున్నాయి. రోడ్లపైకి వెళ్తే.. ఎటునుంచి ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రయాణికుల్లో ఆందోళన కలుగుతోంది. కొత్తగా కార్లు, ఆటోలు నేర్చుకుని, వచ్చీరాని డ్రైవింగ్, రాష్ డ్రైవింగ్, రోడ్డు నిబంధనలు పాటించకపోవడం వల్ల ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. జిల్లాలోని రెండు జాతీయ రహదారులపైనే అధిక ప్రమాదాలు జరుగుతుండటం గమనార్హం. ప్రమాదాల్లో 10 నెలల్లో 211 మంది మృత్యువాత పడగా, 423 మంది క్షతగాత్రులు అయ్యారు.

చర్యలు తీసుకుంటున్నా..

మహబూబ్‌నగర్ జిల్లాలో రెండు ప్రధాన జాతీయ రహదారులు ఉన్నాయి. బాలానగర్ నుంచి అడ్డాకుల వరకు 44వ జాతీయ రహదారి దాదాపు 65 కిలో మీటర్ల మేర ఉండగా, 167వ జాతీయ రహదారి మిడ్జిల్ నుంచి మరికల్ వరకు దాదాపు 80 కిలో మీటర్ల మేర విస్తరించి ఉంది. జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో 65 శాతం ఈ రెండు రహదారులపైనే సంభవిస్తున్నాయి. అందుకే ఈ రహదారులపై ప్రమాదాలను నియంత్రించేందుకు ఎక్కువగా యాక్సిడెంట్లు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించారు. అయితే అక్కడ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నా.. సత్ఫలితాలేమీ రావడం లేదు. 44వ జాతీయ రహదారిపై 18 బ్లాక్ స్పాట్‌లను గుర్తించగా, 167వ జాతీయ రహదారిపై 11 బ్లాక్ స్పాట్లను గుర్తించారు. ఈ రహదారులపై జడ్చర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో 44 మరణాలు సంభవించగా, మహబూబ్‌నగర్ రూరల్ పరిధిలో 30 మరణాలు సంభవించాయి.



44వ జాతీయ రహదారిపై బాలానగర్ సమీపంలో పల్టీ కొట్టిన కారు(ఫైల్)

ప్రమాదాలకు కారణాలివే..

ప్రమాదాల సంఖ్య పెరగడానికి వాహనాల సంఖ్య పెరగడం ఒకటైతే.. చాలామంది సెల్ఫ్ డ్రైవింగ్‌వైపు మళ్ళడంతో పాటు డ్రైవింగ్ నేర్చుకోగానే కార్లు వేసుకుని రోడ్లపైకి వచ్చేస్తున్నారు. కరోనా వచ్చిన తరువాత సెల్ఫ్ డ్రైవింగ్, కార్ల వినియోగం 30 శాతం మేర పెరిగింది. కార్లు తెచ్చుకున్న తరువాత డ్రైవింగ్ నేర్చుకుంటున్నారు. కొద్దిగా డ్రైవింగ్ రాగానే రోడ్లపైకి ఎక్కేస్తున్నారు. ప్రమాదాల సంఖ్య పెరగడానికి ఇది కూడా ఓ కారణంగా తెలుస్తోంది. టూవీలర్ ప్రమాదాలలో ఎక్కువగా మద్యం మత్తులో రాష్ డ్రైవింగ్ చేయడం వల్ల జరుగుతున్నాయి. ఆలస్యంగా బయలుదేరి త్వరగా గమ్యస్థానాలకు చేరుకోవాలన్న ఆతృతలో ఓవర్‌స్పీడ్ ప్రమాదాలకు కారణమవుతోంది. అదేవిధంగా ర్యాష్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం, వాహన నిబంధనలు పాటించకపోవడం వంటి చర్యలు ప్రమాదాలు పెరగడానికి కారణమవుతున్నాయి. అయితే గతేడాదితో పోలిస్తే మరణాల సంఖ్య కాస్త తగ్గినట్లు గణాంకాలు చెబుతున్నాయి. గతేడాది జిల్లాలో 273 మరణాలు సంభవిస్తే ఈ ఏడాది పోలీస్‌శాఖ తీసుకుంటున్నచర్యల కారణంగా కాస్త తగ్గినట్లు తెలుస్తోంది.

బ్లాక్‌స్పాట్‌ల వద్దే..

జిల్లాలో జరుగుతున్న ప్రమాదాల్లో సగానికన్నా పైగా బ్లాక్ స్పాట్‌లలోనే చోటుచేసుకుంటున్నాయి. రెండు జాతీయ రహదారులపై బ్లాక్‌స్పాట్‌ల వద్ద పోలీస్‌శాఖ జీబ్రా లైనింగ్ వేసి, రేడియం స్టిక్కర్లు అంటించారు. బారికేడింగ్‌లను ఏర్పాటు చేసినా ప్రమాదాలు మాత్రం జరుగుతూనే ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రమాదాల కట్టడికి తీసుకుంటున్న చర్యలు అంతగా ఫలించడం లేదని గణాంకాలను బట్టి అర్థమవుతోంది.

211 మంది మృతి.. 423 మంది క్షతగాత్రులు..

బ్లాక్ స్పాట్‌లతోపాటు జిల్లా వ్యాప్తంగా ఈ సంవత్సరం అక్టోబరు నాటికి 452 రోడ్డు ప్రమాద కేసులు నమోదయ్యాయి. వాటిలో 211 మంది దుర్మరణం పాలవగా, 423 మంది క్షతగాత్రులు అయ్యారు. అత్యధికంగా జడ్చర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదాలలో 44 మంది చనిపోగా, 129 మంది గాయపడ్డారు. తరువాత మహబూబ్‌నగర్ రూరల్ పరిధిలో 30 మంది మృత్యువాత పడగా, 72 మంది క్షతగాత్రులుగా మారారు. మూడో స్థానంలో భూత్పూర్ పోలీస్ స్టేషన్ ఉంది. అక్కడ 23 మంది మరణించగా, 30 మంది గాయపడ్డారు. రాజాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 15, అడ్డాకుల పరిధిలో 14, మూసాపేట, దేవరకద్ర పరిధిలో 11 మంది చొప్పున మృత్యువాత పడ్డారు.



రాజాపూర్ వద్ద జరిగిన ప్రమాదంలో లారీ కింద ఉన్న మృతదేహం (ఫైల్)

వాహనదారులు జాగ్రత్తలు తీసుకోవాలి

రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఎన్నో చర్యలు తీసుకుంటున్నాం. అన్ని బ్లాక్‌స్పాట్‌లను రెగ్యులర్‌గా విజిట్‌చేస్తున్నాం. వాహనదారులు తొందరగా వెళ్లాలన్న ఆతృతలో ప్రమాదాలకు గురవుతున్నారు. లాంగ్‌జర్నీలో అలసిపోవడం కూడా ప్రమాదాలకు కారణమవుతుంది. హెల్మెట్ వాడకపోవడం వల్ల టూవీలర్ ప్రమాదాలలో మరణాలు సంభవిస్తున్నాయి. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని కౌన్సెలింగ్‌లు చేస్తున్నాం. పోలీస్‌శాఖ పక్షాన ప్రమాదాల నియంత్రణకు అన్ని చర్యలు తీసుకుంటున్నా వాహనదారులు జాగ్రత్తలు పాటించినపుడే ప్రమాదాలు తగ్గుతాయి. బాలానగర్, దివిటిపల్లి, మూసాపేట వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అక్కడ ట్రాఫిక్ సమయాలలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం.

- ఎస్పీ జానకి, మహబూబ్‌నగర్

చదువుల పండుగతో పిల్లల్లో ఆత్మవిశ్వాసం

● నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): చదువుల పండుగతో పిల్లల్లో ఆత్మవిశ్వాసం, ఆలోచనా శక్తి పెంపొందుతుందని నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. గురువారం సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో విద్యార్థులలో నేర్చుకునే ఉత్సాహాన్ని పెంపొందించేందుకు చదువుల పండుగ కలలు కనేద్దాం.. నేర్చుకుందాం.. సాధిద్దాం అనే కార్యక్రమం వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... చదువుల పండుగ సంభాషణ నైపుణ్యాలను పెంపొందించడానికి వేదికగా ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా రీడ్ ఏ తాన్, స్పార్క్(స్పెల్లింగ్ అండ్ క్విజ్), మనీ మంత్ర, స్పేస్ అవర్, టీ మేకర్ స్పేస్ అండ్ ఏటీఎం ల్యాబ్, వేదిక్ మ్యాథ్స్, ఫ్యూచర్ డాట్స్ కెరీర్ గైడెన్స్, యంగ్ ఒరేటర్ క్లబ్ వంటి కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. డీఈవో గోవిందరాజు మాట్లాడుతూ ప్రతీ పాఠశాలలో విద్యార్థులందరికీ ఈ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలన్నారు. అన్ని పాఠశాలల్లో ఈనెల 10 నాటికి క్విజ్ స్పెల్ బీ రీడింగ్ పోటీలు నిర్వహించాలన్నారు. మండల స్థాయిలో ఈనెల 11న ఫైనల్ పోటీలు నిర్వహించాలని ఎంఈవోలను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ సికాపట్నాయక్, డీఈవో గోవిందరాజు తదితరులు

నెంబర్‌వన్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం

● మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం కృషి అభినందనీయం

● పాలమూరులో కాంగ్రెస్ భారీ బైక్ ర్యాలీ



నగరంలో బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహబూబ్‌నగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌ను నెంబర్‌వన్ సిటీగా మార్చడమే లక్ష్యంగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కృషి చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మునిసిపాలిటీని కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేయించడమే కాకుండా అందుకు తగ్గ అభివృద్ధి చేయాలని నిధులు తేవడానికి అహర్నిశలు కృషి చేస్తున్నారని చెప్పారు. పాలమూరు కార్పొరేషన్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, తాగునీటి కల్పనకోసం ఒకేసారి రూ.824 కోట్ల నిధులు తేవడం చరిత్ర అని, ఎమ్మెల్యే అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే యెన్నంతో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞత తెలిపేందుకు గురువారం డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి ఆధ్వర్యంలో నగరంలో కాంగ్రెస్ శ్రేణులు భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి శ్రీనివాస కాలనీ మీదుగా గడియారం చౌరస్తా వరకు వందల సంఖ్యలో బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, నాయకులు వినోద్‌కుమార్, ఆనంద్ కుమార్‌గౌడ్, సిరాజ్‌ఖాద్రి, సంజీవ్ ముదిరాజ్, మారెపల్లి సురేందర్‌రెడ్డి, ఎన్‌పీ వెంకటేశ్ మాట్లాడుతూ ఒకప్పుడు పని తక్కువ చేసి, ఎక్కువ ఆర్భాటం చేసేవారని, ఇప్పుడు ప్రజాపాలనలో నిధులు తేవడమే లక్ష్యంగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పని చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన రెండేళ్లకాలంలో ఒక్క నగరానికే రూ.వెయ్యి కోట్ల నిధులు తెచ్చారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, నాయకులు చంద్రకుమార్‌గౌడ్, విజయ్‌కుమార్, షబ్బీర్‌అలీ, గోనెల శ్రీనివాస్, సీజే బెనహర్, మైత్రియాదయ్య, మహేందర్, చెన్నయ్య పాల్గొన్నారు.

అట్రాసిటీ బాధితులకు న్యాయం చేయాలి

● కలెక్టర్ విజయేందిర బోయి



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులలో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిరబోయి చెప్పారు. గురువారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో ఎస్పీ డి.జానకితో కలిసి జిల్లా అధికారులు, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులతో సమీక్ష చేశారు. 2019 నుంచి 2025 వరకు నమోదైన కేసులు, బాధితులకు పరిహారం చెల్లింపు, పెండింగ్ కేసులపై చర్చించారు. ప్రతీ నెల 30న పౌరహక్కుల దినోత్సవాన్ని రెవెన్యూ, పోలీస్ అధికారుల సమన్వయంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభ్యులు కోరిన విధంగా ఎస్సీ, ఎస్టీలకు ఇందిరమ్మ ఇళ్లు, పరిశ్రమల శాఖ ద్వారా సబ్సిడీ పథకాలు అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. సీనియర్ సిటిజన్ల కేసులలో ఆర్‌డీఓ, కలెక్టర్ ద్వారా అప్పీల్‌లో వచ్చిన ఉత్తర్వులు సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బాలయ్య, లక్ష్మణ్, రవీంద్రబాబు, చంద్రశేఖర్ మాట్లాడుతూ అంబేడ్కర్ కళాభవన్ వద్ద ఉర్దూ ఘర్ ఏర్పాటును సామరస్యంగా చర్చించి వేరే స్థలంలో ఏర్పాటు చేయాలని కోరారు. సభ్యుడు లక్ష్మణ్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్ సర్వే నంబరు 247, 257లో ఎస్సీ కార్పొరేషన్‌కు కేటాయించిన 5.3 ఎకరాల భూమిలో ఆక్రమణలు జరిగాయని, వాటిని తొలగించాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ రెవెన్యూ, మునిసిపల్ అధికారులు పరిశీలించి హద్దులను నిర్ణయించి, ఖాళీ స్థలంలో ఫెన్సింగ్ వేయాలని చెప్పారు. ఎస్పీ డి.జానకి మాట్లాడుతూ పోలీస్ శాఖ ద్వారా అట్రాసిటీ కేసులపై సత్వరం స్పందించి, చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, అదనపు ఎస్పీ రత్నం, డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ నవీన్, షెడ్యూలు కులాల అభివృద్ధి అధికారి డి.సునీత, పరిశ్రమల శాఖ జీఎం యాదయ్య పాల్గొన్నారు.

చలో ఢిల్లీని విజయవంతం చేయాలి

● సుప్రీం సీజేపై దాడిని ఖండిస్తున్నాం

● పద్మశ్రీ మందకృష్ణ మాదిగ



పీయూలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మందకృష్ణ

పాలమూరు యూనివర్సిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయిపై అక్టోబరు 16న జరిగిన దాడిని ఖండిస్తున్నామని పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్నారు. దాడికి నిరసనగా ఈనెల 17న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, విద్యార్థులు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గురువారం పాలమూరు యూనివర్సిటీ లైబ్రరీ సెమినార్ హాల్‌లో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సందె కార్తీక్ అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో ఇప్పటి వరకు 51 మంది జడ్జీలు మారారని, బీఆర్ గవాయ్ దళితుడైనందునే అతనిపై దాడి జరిగిందన్నారు. ఈ దాడిపై భారత ప్రభుత్వం ఖండించింది తప్ప చర్యలు తీసుకోలేదన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్‌లకు మద్దతు పలకాలని మందకృష్ణ మాదిగను నాయకులు, విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో పీయూ అధ్యాపకులు డాక్టర్ నాగం కుమారస్వామి, డాక్టర్ మాలవి, డాక్టర్ భూమయ్య, డాక్టర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోకపోవడం దారుణం

జడ్చర్ల, (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ వ్యవస్థలో అత్యున్నతమైన సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న దళిత బీఆర్ గవాయ్‌పై దాడి జరిగి నెల రోజులు అవుతున్నా నేటికీ చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం అత్యంత దారుణమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. జడ్చర్ల పట్టణంలోని చంద్రా గార్డెన్స్‌లో గురువారం ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ఉమ్మడి జిల్లా ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ దాడిని దేశ ప్రజలంతా ఖండించినా, చట్టపరమైన వ్యవస్థలు కనీసం సుమోటోగా కేసు స్వీకరించకుండా దళితులను చిన్నచూపు చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బూట్లతో దాడి చేసినా మౌనంగా ఉన్న వ్యవస్థలు, రేపు కత్తులతో దాడి చేసినా ఇలాగే వ్యవహరిస్తాయా అని ప్రశ్నించారు. దాడిని నిరసిస్తూ 17న ఢిల్లీలో లక్షలాది మందితో దళితుల ఆత్మగౌరవ ర్యాలీ చేపడతామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు భీక్షపతి, జంగయ్య మాదిగ, సతీష్ మాదిగ, నాగార్జున మాదిగ, మద్దిలేటి, నరసింహ, రాజు, దశరథం, శ్రీరాములు, చెన్నకేశవులు, రాజేష్, వెంకటయ్య పాల్గొన్నారు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చికెన్ సెంటర్స్ అసోసియేషన్

నేటి చికెన్ ధరలు

ఫామ్ లైవ్	: 110.00
హోల్ సేల్	: 122.00
డ్రెస్డ్	: 191.00
స్కిన్ లెస్	: 218.00



రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

● మరికల్‌లో విద్యార్థుల రాస్తారోకో

మరికల్(ఊట్కూరు), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని బస్టాండ్ చౌరాస్తాలో ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కన్వీనర్ నరేశ్ మాట్లాడుతూ మరికల్ మండలంగా ఏర్పాటై 12 ఏళ్లు అయినా నేటికీ ప్రభుత్వ జూనియర్ కళాశాల లేదన్నారు. దాంతో మరికల్‌తో పాటు పరిసర గ్రామాల పేద విద్యార్థులు ఇతర మండలాలు, జిల్లాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. రాస్తారోకోతో ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు రాస్తారోకోను విరమింపజేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ ఉపాధ్యక్షుడు బన్ని, కళాశాల ఇన్‌చార్జి రాకేష్, ఎస్ఎఫ్ఐ ఇన్‌చార్జి చినరాయుడు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం

» పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్



ఎంఓయూ ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేష్‌బాబు, బయోసైన్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జాన్‌పీటర్

పాలమూరు యూనివర్సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని పాలమూరు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. వర్ష బయోసైన్స్ అండ్ టెక్నాలజీ ఆఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో గురువారం పాలమూరు యూనివర్సిటీ ఎంఓయూ కుదుర్చుకున్నది. యూనివర్సిటీ పరిపాలనా భవనంలోని వీసీ చాంబర్‌లో బయోసైన్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జాన్‌పీటర్, టెక్నాలజీ ఆఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అధికారి, ప్రొఫెసర్ టీవీ రావులతో కలిసి వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేశ్‌బాబు, అసోసియెట్ ప్రొఫెసర్లు డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ కిషోర్‌లతో కలిసి ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. అనంతరం వీసీ మాట్లాడుతూ ఎంఓయూతో అగ్నిబయోటెక్ విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్లకు ఎంతో ఉపయోగకరమన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

» తూకం చేసిన వెంటనే మిల్లులకు పంపించాలి

» వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి



రైతులు తెచ్చిన ధాన్యాన్ని టోకెన్ల వారీగా రిజిస్టర్లలో నమోదు చేయాలని నిర్వాహకులకు చెబుతున్న కలెక్టర్

వనపర్తి రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని, తూకం పూర్తయిన వెంటనే ధాన్యాన్ని లారీల్లో లోడ్ చేసి, కేటాయించిన మిల్లులకు పంపించాలని వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. వనపర్తి జిల్లా, చిట్యాలలోని మార్కెట్ యార్డులో ఐకేపీ ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులు తెచ్చిన ధాన్యం వివరాలను టోకెన్ల వారీగా రిజిస్టర్లలో నమోదు చేస్తున్నారా లేదా అని పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రైతులు తెచ్చిన ధాన్యాన్ని తెచ్చినట్లుగా రిజిస్టర్లలో నమోదు చేయాలని, తేమ శాతాన్ని పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. సన్న, దొడ్డు రకం బియ్యాన్ని గుర్తించడంలో నిర్వాహకులు అవగాహన కలిగి ఉండాలన్నారు. అక్కడే ఉన్న నిర్వాహకురాలిని గుర్తించాలని ఆదేశించగా, ఆమె తడబాటుకు గురవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం గుర్తించే విధానాన్ని వారికి నేర్పించాలని సీసీకి సూచించారు.

పంట నష్టం వివరాలు నమోదు చేయించుకోవాలి



వటువర్లపల్లిలో నీట మునిగిన పంటను పరిశీలిస్తున్న ఏవో మహేశ్‌రెడ్డి

బ్రహ్మగిరి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటల వివరాలను నమోదు చేయించుకోవాలని నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ మండల వ్యవసాయాధికారి మహేశ్‌రెడ్డి రైతులకు సూచించారు. వటువర్లపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పంట నష్టం వివరాలను రైతులు విధిగా నమోదు చేయించుకోవాలని సూచించారు. సీసీఐ ద్వారా పత్తిని విక్రయించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. పట్టాదారు పాస్‌బుక్, బ్యాంకు ఖాతాబుక్, ఆధార్ కార్డు, పంట పొలం వద్ద దిగిన ఫొటోలతో వ్యవసాయ శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని రైతులకు సూచించారు. అనంతరం గ్రామ సమీపంలో నీట మునిగిన పంటలను పరిశీలించారు. ఆయన వెంట ఏఈవో దేవి, రైతులు కాశయ్య, శ్రీను, మల్లేశ్, శంకర్, బాబురావు, విష్ణు తదితరులున్నారు.

ఖగోళ శాస్త్ర ప్రయోగశాలను తిలకించిన డీఈవో



ఖగోళశాస్త్ర ప్రయోగశాలను తిలకిస్తున్న డీఈవో

జడ్చర్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీ బాదేపల్లి బాలుర జడ్పీహెచ్‌ఎస్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఖగోళ శాస్త్ర ప్రయోగశాలను జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్ తిలకించారు. పాఠశాలను గురువారం ఆయన సందర్శించిన సందర్భంగా పాఠశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అపార్ ఐడీ జనరేషన్ క్యాంప్‌ను పరిశీలించారు. అనంతరం వంటగది, ఔషధ తోటలను సందర్శించారు. ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ, ఉపాధ్యాయులు గోపాల్, యుగంధర్, సునీల్‌కుమార్, నజ్రీన్‌ఫాతిమా పాల్గొన్నారు.

ఊకచెట్టు వాగులో మృతదేహం లభ్యం

ఆత్మకూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, ఆత్మకూరు మండలంలోని తిప్పడంపల్లి శివారులోని ఊకచెట్టువాగులో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ జయన్న, గ్రామపరిపాలన అధికారి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వాగులో మృతదేహం ఉన్నట్లు గురువారం మధ్యాహ్నం 12 గంటలకు సమాచారం అందించడంతో ఎస్‌ఐతో పాటు వాగువద్దకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయసు దాదాపు 45 సంవత్సరాలు ఉంటుందని, ఎత్తు 5.5 ఉందని, ఒంటిపై ఆకుపచ్చ టీ షర్ట్, నీలి రంగు లోయర్ ఉన్నాయని ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



మక్తల్ మండలం పారేవుల వద్ద యంత్రంతో వరి కోతలు



ఊట్కూర్ మండలం తిప్రాస్‌పల్లి దగ్గర పత్తిమిల్లుల్లో విక్రయంకోసం వరుసలో ఉంచిన వాహనాలపై టార్పాలిన్‌కవర్లు కపిగా ఆకాశం మేఘావృతం

గుబులు రేపుతున్న మబ్బులు

» హఠాత్తుగా కమ్ముకుంటున్న కారుమేఘాలు

» ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతుల కష్టాలు



మక్తల్ మండలం పారేవుల వద్ద ఆరబోసిన ధాన్యాన్ని కుప్పలు కడుతూ టార్పాలిన్ కవర్లు కప్పుతున్న రైతులు

నారాయణపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆకాశంలో కమ్ముకుంటున్న కారుమేఘాలు అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. నారాయణపేట జిల్లాలో ప్రస్తుతం వరి కోతలు, పత్తి తీతలు జోరుగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో వర్షం వస్తే చేసిన కష్టమంతా నీటి పాలవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నారాయణపేట జిల్లా, మక్తల్ మండలంలోని పారేవులలో గురువారం ఉదయం వాతావరణంగా బాగానే ఉంది. మధ్యాహ్నం తర్వాత ఆకాశంలో మబ్బులు కమ్ముకున్నాయి. ఆ సమయంలో యంత్రంతో వరి కోతలు కొనసాగిస్తున్న రైతులు ఒక్క సారిగా ఆందోళనకు గురయ్యారు. అప్పటికే కోతలు పూర్తయి కల్లాల్లో ఆరబోసిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు పరుగులు తీశారు. వాటిపై టార్పాలిన్లు, కవర్లు కప్పేందుకు హడావిడి పడ్డారు. అలాగే ఊట్కూర్ మండలంలోని తిప్రాస్‌పల్లి మిల్లు వద్దకు రైతులు పత్తిలోడుతో తెచ్చిన వాహనాలు బారులు తీరి ఉన్నాయి. మబ్బులు కమ్ముకోవడంతో పత్తిని కాపాడుకునేందుకు వాహనాలపై కవర్లు కప్పుకున్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

» అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

» జోనల్ లెవల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



క్రీడా పోటీల ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట, నవంబరు 6 : (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ విద్యార్థులకు సూచించారు. నాగర్‌కర్నూల్ అచ్చంపేటలో గురువారం ఏర్పాటు చేసిన జోన్-7, 11వ జోనల్ లెవల్ స్పోర్ట్స్ మీట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. రాష్ట్రాన్ని క్రీడాహబ్‌గా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులు, జోనల్ అధికారులు, డీఎస్‌వో శ్రీనివాసులు, పీఈటీలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

మల్టీ స్పెషాలిటీ మెగా వైద్య శిబిరం

అచ్చంపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గురువారం ఏర్పాటు చేసిన మల్టీ స్పెషాలిటీ మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ప్రారంభించారు. సీబీఎం ట్రస్ట్ సహకారంతో, ఎస్‌వీఎస్ మెడికల్ కళాశాల వైద్యులు స్థానికులకు వైద్యసేవలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మా సూచన మేరకు గతంలో సర్జికల్ క్యాంపు నిర్వహించినట్లు గుర్తు చేశారు.

1,467 మందిని వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఆపరేషన్లు చేసినట్లు చెప్పారు. వైద్య శిబిరంలో 1439 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభు, వైద్యులు మహేశ్, పావని, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దుండగులపై కఠిన చర్యలు

» ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

» సంజాపూర్ గ్రామంలో పర్యటన

» హత్యాయత్నం జరిగిన స్థల పరిశీలన



వివరాలను తెలుసుకుంటున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

కల్వకుర్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : హత్యాయత్నం చేసిన దుండగులపై కఠిన చర్యలు తీసుకుంటామని నాగర్‌కర్నూల్ ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి మునిసిపాలిటీ పరిధిలోని సంజాపూర్ గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. గ్రామానికి చెందిన జంగయ్య, ఆలివేల, పరమేశ్‌లపై హత్యాయత్నం జరిగిన స్థలాన్ని పరిశీలించారు. సంఘటన వివరాలను ఆరా తీశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. సంజాపూర్ గ్రామానికి చెందిన గుర్రం మల్లేశ్‌కు, వెల్దండ మండలం చెర్కూర్ గ్రామానికి చెందిన శిరీషతో రెండేళ్ల క్రితం వివాహం అయ్యిందన్నారు. మల్లేశ్‌కు అంతకుముందే మరో యువతితో వివాహేతర సంబంధం ఉండటంతో, శిరీష బాగోగులు చూసుకోవడం లేదు. దీంతో శిరీష కుటుంబ సభ్యులు అతడి పేరున ఉన్న 30 గుంటల భూమిని శిరీష పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించారు. మరో 30 గుంటల భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని ఒత్తిడి తెచ్చారు. ఈ క్రమంలో మల్లేశ్ మూడునెలలుగా భార్యను వదిలేసి, మరో మహిళతో ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో శిరీష అన్నలు శివ, ప్రశాంత్‌లతో పాటు వెల్దండకు చెందిన మరో నలుగురు బుధవారం సాయంత్రం సంజాపూర్‌కు వచ్చారు. భూమిని తమ చెల్లెలి పేరున రిజిస్ట్రేషన్ చేయాలని మల్లేశ్ తండి జంగయ్యను కోరగా, అందుకు అతడు ఒప్పుకోలేదు. దీంతో మల్లేష్ తండ్రి జంగయ్య, తల్లి అలివేల, తమ్ముడు పరమేశ్‌లను కర్రలతో కొట్టి, గొడ్డలితో దాడి చేశారు. సంఘటనలో తీవ్రంగా గాయపడిన జంగయ్య, ఆలివేల, పరమేశ్‌లను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ప్రస్తుతం జంగయ్య పరిస్థితి విషమంగా ఉండగా, ఆలివేల, పరమేశ్‌ల ఆరోగ్యం నిలకడగా ఉందని ఎస్పీ తెలిపారు. సంఘటనపై కేసు నమోదు చేసి, నిందితులు ఐదుగురిని అరెస్టు చేశామని, మరొకరు పరారీలో ఉన్నాడని తెలిపారు. అతడి కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. దోషులకు కఠిన శిక్ష పడేలా చూస్తామని, బాధితులకు అండగా ఉంటామని తెలిపారు. ఆయన వెంట డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ బి.నాగార్జున, ఎస్‌ఐ జి.మాధవరెడ్డి ఉన్నారు.

పీఏసీఎస్ చైర్మన్ పోషం గణేశ్ సస్పెన్షన్



అమ్రాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ భవనం

అమ్రాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ పీఏసీఎస్ చైర్మన్ పోషం గణేశ్‌ను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఖరీఫ్ సీజన్‌లో ప్రాథమిక సహకార సంఘానికి ప్రభుత్వం నుంచి వచ్చిన యూరియాను నిర్దేశిత ధర కంటే ఎక్కువకు విక్రయించారని, పక్కదారి పట్టించారని అతడిపై వ్యవసాయశాఖ అధికారులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో, అతడిని సస్పెండ్ చేశారు. ఆరు నెలల క్రితం గణేష్ చైర్మన్ పదవీ కాలం ముగిసింది. ఎన్నికలు జరపకపోవడంతో పదవీకాలాన్ని ప్రభుత్వం ఆరునెలలు పొడిగించింది. ఇటీవలే మరోసారి మరో ఆరు నెలల పాటు పదవీకాలాన్ని పొడిగించింది. తాజాగా అతడు సస్పెండ్ కావడంతో, ఆయన స్థానంలో ఇప్పలపల్లి పీఏసీఎస్ డైరెక్టర్ అల్లు మంగమ్మను చైర్మన్ నియమిస్తూ ఉత్తర్వులు అందించినట్లు సహకార శాఖ జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ మధు తెలిపారు.

బేకరీల్లో ఆకస్మిక తనిఖీ

» పరిశుభ్రత పాటించకపోతే చర్యలు తప్పవు

» హెచ్చరించిన మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్

మద్దూర్, నవంబర్ 6 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మద్దూరు పట్టణంలోని పలు బేకరీలను మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విక్రయానికి సిద్ధంగా ఉంచిన ఆహారపదార్థాలను పరిశీలించారు. ఎక్కువ కాలం నిల్వ ఉంచిన పలు పదార్థాలను, ప్లాస్టిక్ సామగ్రిని సీజ్ చేశారు. అనంతరం మాంసం దుకాణాలను తనిఖీ చేశారు. పరిశుభ్రత పాటించకపోతే చర్యలు తప్పవని వ్యాపారులను హెచ్చరించారు. ఆ తర్వాత మద్దూర్ కొత్తబస్టాండ్ ప్రధాన మార్గంలో కొనసాగుతున్న డ్రైనేజీ పనులను పరిశీలించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనీల్‌కుమార్, మునిసిపల్ సిబ్బంది ఆంజనేయులు, జాఫర్, కేశవులు ఉన్నారు.



మద్దూర్‌లోని బేకరీలో తినుబండారాలను పరిశీలిస్తున్న కమిషనర్

పుట్టింటికి వెళ్లి తిరిగి రాని భార్య

» పోలీసులకు ఫిర్యాదు చేసిన భర్త

నవాబ్‌పేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పుట్టింటికి వెళ్లిన తన భార్య తిరిగి రాకపోవడంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నవాబ్‌పేట ఎస్‌ఐ విక్రం గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, నవాబ్‌పేట మండలంలోని కాకర్లపాడ్ గ్రామానికి చెందిన కృష్ణవేణికి కొంతకాలం క్రితం మూసాపేట మండలం వేముల గ్రామానికి చెందిన తోట యాదయ్యతో వివాహమైంది. రెండు నెలల క్రితం ఆమె తన తల్లిగారి ఊరు కాకర్లపాడుకు వెళ్లి అక్కడే ఉండిపోయింది. దీంతో తన భార్యను కాపురానికి పంపించాలని యాదయ్య తన బావమరిది మల్లేష్‌ను కోరాడు. అతడు పంపిస్తామని చెప్పినా ఆమె రాకపోవడంతో మరోసారి ఫోన్ చేశాడు. తన చెల్లెలు మరో వ్యక్తితో వెళ్లినట్లు మల్లేశ్ చెప్పడంతో యాదయ్య గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుప్తనిధుల కోసం ఆలయంలో తవ్వకాలు



రాయలగండి లక్ష్మీచెన్నకేశవ ఆలయంలో తవ్వకాలకు గురైన ప్రాంతం

పదర, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, పదర మండలంలోని రాయ లగండి లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో గుప్తనిధుల కోసం గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు జరిపారు. ఆ తర్వాత ఎవరికీ అనుమానం రాకుండా గుంతను పూడ్చివేసినట్లు భక్తులు తెలిపారు. ఆలయంలో ఇప్పటికే మూడు సార్లు తవ్వకాలు జరిపినా అధికారులు పట్టించుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

116 గ్రాముల గంజాయి స్వాధీనం



జడ్చర్లలో పట్టుబడిన నిందితుడు, స్వాధీనం చేసుకున్న గంజాయి వివరాలు వెల్లడిస్తున్న డీటీఎఫ్ సీఐ కవిత

జడ్చర్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మండలంలోని శంకరాయపల్లితండా వద్ద ఎక్సైజ్ శాఖ మహబూబ్‌నగర్ డీటీఎఫ్ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని సోదా చేయగా 116 గ్రాముల గంజాయి లభించింది. అతడిని జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన పింటుసాగా గుర్తించారు. ఆయన ఉదండాపూర్ ప్రాజెక్ట్ నిర్మాణ పనులు చేపట్టిన ఓ కంపెనీలో పనిచేస్తున్నట్లు తెలుసుకున్నారు. తమ రాష్ట్రం నుంచి గంజాయిని తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని డీటీఎఫ్ సీఐ కవిత తెలిపారు. తనిఖీల్లో ఎస్‌ఐ రాజేందర్, ఎక్సైజ్ డీటీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

60 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత




రేషన్ బియ్యాన్ని తరలిస్తూ పట్టుబడిన వాహనాలను తాడూరు పోలీస్‌స్టేషన్‌లో సీజ్ చేసిన వైనం

తాడూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు పట్టుకున్నారు. బల్మూరు మండలం గట్టుతుమ్మెన్ గ్రామానికి చెందిన సాయిప్రకాశ్ అనే వ్యక్తికి సంబంధించిన రేషన్ బియ్యాన్ని రెండు బొలెరో వాహనాల్లో కల్వకుర్తికి తరలిస్తున్నట్లు ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులకు సమాచారం అందింది. మండల కేంద్ర సమీపంలో, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి ప్రధాన రహదారిపై, మల్కాపూర్ గేటు వద్ద రెండు వాహనాలను తనిఖీ చేశారు. 60 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించారు. వాహనాలను తాడూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితుడు సాయిప్రకాశ్‌తో పాటు డ్రైవర్లు మల్లేశ్, ఫిరోజ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

బిజినేపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండలకేంద్రంలో పేకాట శిబిరంపై పోలీసులు గురువారం సాయంత్రం దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కె.శ్రీనివాస్ తెలిపారు. వారి నుంచి రూ.20 వేలు, ఏడు సెల్‌ఫోన్లు, రెండు బైక్‌లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ఇసుక స్థావరాలపై దాడులు



ఇసుక స్థావరాలను ధ్వంసం చేస్తున్న ఎస్‌ఐ శివానందం, తహసీల్దార్ రాధాకృష్ణ

రాజాపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు మండలంలోని దుందుభి వాగులో ఇసుకను అక్రమంగా తయారు చేసి తరలిస్తున్న స్థావరాలపై గురువారం రెవెన్యూ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుందుభి వాగు వద్ద కృత్రిమ ఇసుక తయారు చేసి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్రైం కార్నర్

వాట్సాప్ స్టేటస్‌లో 'ద ఎండ్'

» మూడో అంతస్తు పైనుంచి దూకిన నర్సింగ్ విద్యార్థిని

» పరిస్థితి విషమం..

» మేడ్చల్ జిల్లా, ఘట్‌కేసర్‌లో ఘటన



మల్లి పూజిత(ఫైల్)

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వాట్సాప్ స్టేటస్‌లో 'ద ఎండ్'.. మరుసటి రోజు కళాశాల మూడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది ఓ బీఎస్సీ నర్సింగ్ విద్యార్థిని. ఈ ఘటన మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, కళాశాల యాజమాన్యం తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా, లింగాల మండల కేంద్రానికి చెందిన మల్లి పూజిత(23) అన్నోజిగూడలో అద్దెకుంటూ అవుశాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో నీలిమా స్కూల్ అండ్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో బీఎస్సీ నర్సింగ్ మూడో సంవత్సరం చదువుతోంది. పూజితకు జ్వరం రావడంతో గురువారం కళాశాలకు ఆమె స్నేహితురాలితో కలిసి ఆటోలో వచ్చింది. మధ్యాహ్నం లంచ్‌కు రాకుండా 1.30 గంటలకు చాలాసేపు ఫోన్‌లో మాట్లాడి రెయిలింగ్‌పై ఫోన్ పెట్టి కళాశాల భవనం మూడో అంతస్తు నుంచి దూకింది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో గమనించిన విద్యార్థులు కళాశాల డీన్ సాయంతో ప్రథమ చికిత్స నిమిత్తం జీడిమెట్లలోని నీలిమను ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి పూజిత ఆత్మహత్యాయత్నానికి కారణాలను ఆమె స్నేహితులను అడిగి తెలుసుకున్నారు. జ్వరంతో కళాశాలకు ఆటోలో వచ్చిందని, ఉదయం మాత్ర వేసుకొని టిఫిన్ చేసిందని ఆమె స్నేహితురాలు తెలిపారు. అయితే పూజిత తన ఫోన్‌లో బుధవారం సాయంత్రం 'ద ఎండ్' అని స్టేటస్ పెట్టుకున్నదని తెలిపారు. ప్రేమ వ్యవహారంతోనే పూజిత ఆత్మహత్యకు యత్నించి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు, ఆటో ఢీ

» నలుగురికి తీవ్ర, మరో 12 మందికి స్వల్ప గాయాలు

పెబ్బేరు రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కూలీలతో వెళ్తున్న ఆటోను కారు ఢీకొనడంతో 16 మంది గాయపడ్డారు. వారిలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వనపర్తి జిల్లా, పెబ్బేరు మండల పరిధిలోని తోమాలపల్లి గ్రామానికి చెందిన 16 మంది కూలీలు జోగులాంబ గద్వాల జిల్లాలో పత్తితీత పని కోసం ఆటోలో బయలుదేరారు. వారు వస్తున్న ఆటోను బైపాస్‌లో గద్వాల నుంచి పెబ్బేరు వైపు వస్తున్న కారు ఢీకొన్నది. దీంతో ఆటోలో ఉన్న 12 మంది కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ రవితో పాటు గీరమ్మ, చెన్నమ్మ, అక్కమ్మ అనే మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు స్పందించి క్షతగాత్రులను 108 అంబులెన్సులో వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి తెలిపారు.

కారు, స్కూటీ ఢీకొని యువకుడికి..

వెల్దండ (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల పరిధిలోని రాఘాయిపల్లి గేట్ సమీపంలో హైదరాబాద్ - శ్రీశైలం ప్రధాన రహదారిపై కారు, స్కూటీ ఢీకొని ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పెద్దాపూర్ గ్రామానికి చెందిన చెన్నోజు నవీన్ స్కూటీపై తమ ఊరికి వస్తూ, హైదరాబాద్ నుంచి కల్వకుర్తి వైపు వస్తున్న కారును వెనుక నుంచి ఢీకొట్టాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నవీన్‌ను స్థానికులు కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. క్షతగాత్రుడి తండ్రి శేఖరాచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు.

కారు, ద్విచక్రవాహనం ఢీకొని ఇద్దరికి..

వనపర్తి రూరల్ (ఆంధ్రజ్యోతి) : కారు, ద్విచక్రవాహనం ఢీకొని ఇద్దరు యువకులు గాయపడ్డారు. వనపర్తి మండలంలోని నాచహళ్లి శివారులో గురువారం ఈ సంఘటన జరిగింది. కిష్టగిరికి చెందిన మహేశ్, శశి లు ద్విచక్రవాహంనై గ్రామం నుంచి పెబ్బేరుకు వెళ్తూ, నాచహళ్లి శివారులో ఎదురుగా వస్తున్న కారును ఢీకొన్నారు. దీంతో ఇద్దరు యువకుల కాళ్లు విరిగాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి, వారిని వనపర్తి జిల్లా ఆసుపత్రికి తరలించారు. కారు యజమాని షకీల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ జలంధర్‌రెడ్డి తెలిపారు.

బస్సు, బైక్ ఢీకొని ఒకరికి..

మహమ్మదాబాద్ (ఆంధ్రజ్యోతి) : బస్సు, బైకు ఢీకొని ఓ యువకుడు గాయపడ్డాడు. మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండల పరిధిలోని నంచర్ల గేట్ క్రాస్ రోడ్డులో గురువారం ఈ ప్రమాదం జరిగింది. దేశాయిపల్లి గ్రామానికి చెందిన బన్ని అనే యువకుడు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా, నంచర్ల గేటు వద్ద పరిగి డిపోకు చెందిన బస్సు ఢీకొన్నది. దీంతో గాయపడిన అతడిని 108 అంబులెన్సులో మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బైక్ ఢీకొని పాదచారికి..

వెల్దండ, నవంబరు మండల పరిధిలోని వెల్దండ - చారకొండ రోడ్డుపై బొల్లంపల్లి చౌరస్తా వద్ద గురువారం రాత్రి పాదచారిని గుర్తుతెలియని బైక్ ఢీకొన్న సంఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బొల్లంపల్లి గ్రామానికి చెందిన బండ్ల జంగయ్య అను వ్యక్తి తన వ్యవసాయ పొలంనుండి ఇంటికి నడుచుకుంటూ వస్తుండగా వెనుకగా వచ్చిన గుర్తుతెలియని ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో జంగయ్య తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో జంగయ్యను చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బాలుడి మృతదేహం లభ్యం

» జూరాల కాలువలో చేపల వేటకు వెళ్లి గల్లంతు

గద్వాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జూరాల కాలువలో గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యమైంది. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని బీడీ కాలనీకి చెందిన మౌలాలి కుమారుడు సలీమ్ (15) బుధవారం మండల పరిధిలోని గుంటిపల్లి - రేకులపల్లి రోడ్డు సమీపంలోని జూరాల కాలువలో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటిలో పడి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు గురువారం గజ ఈతగాళ్ల సహకారంతో కాలువలో గాలింపు చేపట్టారు. గల్లంతైన ప్రదేశానికి సమీపంలోనే బాలుడి మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన డీసీఎం

అయిజ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కర్నూల్ రహదారిలో అదుపు తప్పిన డీసీఎం పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్ళింది. ఆ డీసీఎం బుదవారం రాత్రి కర్నూల్ నుంచి వరి విత్తనాల లోడ్‌తో రాయిచూర్‌కు వెళ్లింది. అక్కడ అన్‌లోడ్ చేసి అయిజ మీదుగా కర్నూల్‌కు బయలుదేరింది. అర్ధరాత్రి 12 గంటల సమయంలో దర్గా వంతెన సమీపంలో అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్ళింది. డ్రైవర్ క్షేమంగా సురక్షితంగా బయటపడ్డాడు.

అప్పు చెల్లించాలని వ్యక్తిపై దాడి

కోడేరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తీసుకున్న అప్పు తిరిగి చెల్లించలేదని ఓ వ్యక్తిపై మరో వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. స్థానికులు, కోడేరు ఎస్‌ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, కోడేరు మండలంలోని పస్పుల గ్రామానికి చెందిన ఎఖ్రా అనే వ్యక్తి, పెంట్లవెల్లి మండల కేంద్రానికి చెందిన రమేశ్‌నాయుడు రూ. 7.12 లక్షలు అప్పు తీసుకున్నాడు. అప్పు చెల్లించాలని అతడు ఎఖ్రాను అడుగగా అప్పుడు, ఇప్పుడూ అంటే దాటవేస్తున్నాడు. దీంతో రమేశ్‌నాయుడుతో పాటు మరికొందరు బుధవారం పసుపుల గ్రామంలోని వారి ఇంటికి వెళ్లి డబ్బులు అడిగారు. ఈ సందర్భంగా మాటామాటా పెరిగిన ఎఖ్రాపై దాడి చేశారు. అతడు 100కు ఫోన్ చేయడంతో కోడేరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని అందరినీ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అయితే కేసు తమ పరిధిలోకి రాదని చెప్పి, పెంట్లవెల్లికి పంపించారు. అక్కడ ఎస్‌ఐ లేకపోవడంతో రమేశ్‌నాయుడు, అతడి అనుచరులు ఎఖ్రాను వెంట తీసుకెళ్లారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ జగదీశ్వర్ ఎఖ్రాను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

తీరనున్న ఉపాధ్యాయుల కొరత

» 320 మంది బోధకుల నియామకానికి గ్రీన్ సిగ్నల్

నారాయణపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరనున్నది. ఆయా పాఠశాలల బోధకుల నియామకానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి అందాయి.

ప్రభుత్వం గత ఏడాది జూన్, ఈ ఏడాది అగస్టులో పలువురు ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించింది. దీంతో ఏర్పడిన ఖాళీల భర్తీకి బోధకులను నియమించాలని నిర్ణయించిన ప్రభుత్వం, అందుకు అనుగుణంగా ఉత్తర్వులు జారీ చేసింది.

పేట జిల్లాలో 429 పోస్టులు ఖాళీ

నారాయణపేట జిల్లా వ్యాప్తంగా 2,323 ఉపాధ్యాయ పోస్టులకు గాను 1,894 మంది పని చేస్తున్నారు. పదోన్నతులతో 429 పోస్టులు ఖాళీ అయ్యాయి. 90 మంది సర్‌ప్లస్ టీచర్లు (విద్యార్థులు తక్కువ, ఉపాధ్యాయులు తక్కువ) ఉన్నట్లు అధికారులు గుర్తించారు. జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 337 ఉండగా, వాటిలో 18,096 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 86 ఉండగా, 9,989 మంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 75 ఉండగా, 22,319 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు 112కు 112 మంది ఉన్నారు. ఎస్‌జీటీలు 1,191 మందికి గాను, 860 మంది పని చేస్తున్నారు. 331 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 1,038 గాను, 939 మంది పని చేస్తున్నారు. 99 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జీహెచ్‌ఎంలు 63 మందికి గాను, 55 మంది పనిచేస్తుండగా, 8 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. భాషా పండితులు 29 మందికి 29 మంది పనిచేస్తుండగా, పీటీలు 8 మంది, పీడీలు 37 మంది విధుల్లో ఉన్నారు. వారిలో 76 మందిని సర్దుబాటు చేశారు. ఏకోపాధ్యాయ పాఠశాలలు 116 ఉండడంతో విద్యాబోధనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రత్యామ్నాయంగా 320 మంది బోధకులను నియమించాలని జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. గత ఏడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా నియామకానికి చర్యలు తీసుకోవాలని జూలై 17న మద్దూర్ మండలం లోని నిడ్జింత జడ్పీహెచ్‌ఎస్‌కు వచ్చిన విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణాకు పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యాదగిరి జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు వినతి పత్రం సమర్పించారు.



ఊట్కూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలెక్టర్ సిక్తా పట్నాయక్ (ఫైల్)

9న జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీలో పాల్గొననున్న మహబూబ్‌నగర్ జిల్లా బాల, బాలికల జట్లను ఈ నెల 9న ఎంపిక చేయనున్నారు. ఈ మేరకు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శాంతికుమార్, కురుమూర్తిగౌడ్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనదలుచుకున్న బాలురు 75 కిలోల బరువు కలిగి ఉండాలని, 2006, జనవరి 18 తరువాత జన్మించి ఉండాలని సూచించారు. బాలికలు 65 కిలోల బరువు ఉండాలని, 2005, డిసెంబర్ 29 తర్వాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తిగల వారు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో 9వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు రిపోర్టు చేయాలని కోరారు. ఎంపికైన బాలుర జట్టు డిసెంబర్ 5 నుంచి 7వ తేదీ వరకు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి టోర్నీలో పాల్గొంటుందని తెలిపారు. బాలికల జట్టు కరీంనగర్ జరిగే టోర్నీలో పాల్గొంటుందని పేర్కొన్నారు.



దిగువ జూరాల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలోని టర్బైన్‌లు

పవర్ 'ఫుల్'

» రికార్డు స్థాయిలో జల విద్యుత్ ఉత్పత్తి

» ప్రాజెక్టుల ప్రారంభం నుంచి ఇదే అత్యధికం

ఆత్మకూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఈ ఏడాది రికార్డు స్థాయిలో ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ప్రాజెక్టు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 950 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి సాధించినట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లో 610 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని లక్ష్యంగా నిర్దేశించారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో భారీ వర్షాలతో జూరాల ప్రాజెక్టుకు నిరంతరాయంగా వరద వస్తుండటంతో జూన్ మొదటి వారం నుంచి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించారు.

అక్టోబర్ మొదటి వారం నాటికే నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించి, 950 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేశారు. జెన్‌కో అధికారుల సహకారంతోనే రికార్డు స్థాయి ఉత్పత్తి సాధించినట్లు ఎస్‌ఈ తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

» డీఎస్పీ బుర్రి శ్రీనివాస్

» వెల్గొండలో పోలీసుల 'కమ్యూనిటీ కాంటాక్ట్'



వెల్గొండలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ బుర్రి శ్రీనివాస్

బిజినేపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ బుర్రి శ్రీనివాస్ ప్రజలకు సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి రూ. 50 వేలు కడితే, లక్ష రూపాయలు మీ ఖాతాలో వేస్తామంటూ మాయమాటలు చెప్తే మోసపోవద్దని హెచ్చరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండలంలోని వెల్గొండలో గురువారం తెల్లవారుజామున డీఎస్పీ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా నాగర్‌కర్నూల్ సర్కిల్ పరిధిలోని ఐదుగురు ఎస్‌ఐలు, 60 మంది పోలీసు సిబ్బంది తనిఖీలు చేపట్టారు. సరైన ధ్రువపత్రాలు లేని 47 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలు, ఒక టాటా ఏస్, 2 బొలెరోలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సీజ్ చేసిన వాహనాల యజమానులు సరైన ధ్రువపత్రాలను సమర్పిస్తే తిరిగి అప్పగిస్తామని చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా శుభకార్యాలు, ఇతర పనుల కోసం ఇంటికి తాళాలు వేసి వెళ్ళేటప్పుడు విధిగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. తద్వారా చోరీలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు. రెండు, మూడు రోజుల వరకు వచ్చే పరిస్థితి లేనప్పుడు ఇంట్లో విలువైన అభరణాలు, నగదు ఉంచకూడదని సూచించారు. గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ ఆశోక్ రెడ్డి, ఎస్‌ఐ కే.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

» రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి



లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న చిన్నారెడ్డి

వనపర్తి టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పేద, బడుగు, బలహీనవర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని తన నివాసంలో గురువారం సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 78 మంది లబ్ధిదారులకు రూ. 22 లక్షలకు పైగా విలువైన చెక్కులను అందించినట్లు తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచడమే కాకుండా, కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకున్న పేదలను, సీఎం సహాయ నిధి ద్వారా ఆదుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, ఖమర్‌మియా, ప్రధాన కార్యదర్శి చీర్ల జనార్దన్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎండీ బాబా, సమ్మద్ మియా, జానంపేట నాగరాజు, నాగార్జున, అబ్దుల్లా, గోవర్ధన్, లీలావతి పాల్గొన్నారు.

సత్తా చాటిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు



నేషనల్ క్రికెట్ లీగ్‌కు ఎంపికైన పాలమూరు జిల్లా క్రీడాకారులు



రాష్ట్రస్థాయి కబడ్డీకి ఎంపికైన ఖిల్లాఘణపురం కేజీబీవీ ఇంగ్లిష్ మీడియం విద్యార్థిని పూజ



12 అండర్ 17 రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన ఆత్మకూరు విద్యార్థితో పీఈటీలు

» నేషనల్ క్రికెట్ లీగ్‌కు ముగ్గురి ఎంపిక

» రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఇద్దరు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్/ ఖిల్లాఘణపురం/ ఆత్మకూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. నేషనల్ క్రికెట్ లీగ్ (ఎన్‌సీఎల్)కు మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. హైదరాబాద్ పరిధిలో, మొయినాబాద్‌లోని క్రికెట్ మైదానంలో బుధవారం నిర్వహించిన సౌత్‌జోన్ రాష్ట్రస్థాయి ప్రాబబుల్స్ మ్యాచ్‌లో షేక్‌ఫర్హాన్, మహ్మద్ ముర్తుజాఅలీ, జి.శ్రేయాన్ మెరుగైన ప్రతిభ కనబరిచి, ఎన్‌సీఎల్ లీగ్, అండర్-12 విభాగంలో చోటు దక్కించుకున్నారు. త్వరలో గోవా, హైదరాబాద్‌లలో నిర్వహించనున్న ఎన్‌సీఎల్ వేలంలో వీరు పాల్గొననున్నారు. షేక్‌ఫర్హాన్, మహ్మద్ ముర్తుజాఅలీ, జి.శ్రేయాన్‌లను జిల్లా క్రికెట్ క్లబ్ కోచ్‌లు రియాజుద్దీన్, ముఖ్తర్, నవాజ్ అభినందించారు. టోర్నీలో ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు.

● ఆత్మకూరు ప్రభుత్వ బాలుర పాఠశాల 10వ తరగతి విద్యార్థి మోహన్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు మండల విద్యాధికారి కొండాపురం బాలరాజ్ తెలిపారు. ఇటీవల నారాయణపేట జిల్లా మద్దూరు మండలంలో జరిగిన ఉమ్మడి పాలమూరు జిల్లా అండర్ 17 కబడ్డీ పోటీల్లో మోహన్ సత్తా చాటినట్లు తెలిపారు. ఈ నెల 8 నుంచి 25వ తేదీ వరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నాడు.


ఈ సందర్భంగా గురు వారం పాఠశాలలో విద్యార్థి మోహన్‌ను ప్రధానోపాధ్యాయుడు బాలస్వామి, పీఈటీ వెంకటేశ్వర్, ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా, వాలీబాల్ కోచ్ ఖాదర్ తదితరులు అభినందించారు.

● వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం కేజీబీవీ ఇంగ్లీష్ మీడియం 9వ తరగతి విద్యార్థిని కె.పూజ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ఎస్‌ఓ లలిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.


నారాయణపేటలో ఈ నెల 4న జరిగిన అండర్ - 17 ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్ జోనల్ మీట్‌లో పూజ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు భద్రాద్రి కొత్తగూడెంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో బాలిక పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, పీఈటీ చిట్టి ఆమెను అభినందించారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు వస్పుల విద్యార్థి

మిడ్జిల్ : (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండలంలోని వస్పుల జడ్పీహెచ్‌ఎస్ 10వ తరగతి విద్యార్థి బి.చరణ్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ శంకర్ తెలిపారు. నారాయణపేట జిల్లా, కోస్గి మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో బుధవారం నిర్వహించిన పోటీల్లో చరణ్ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడని చెప్పారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటయ్య, పీడీ శంకర్, ఉపాధ్యాయులు చరణ్‌ను అభినందించారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు కోస్గిలో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో చరణ్ పాల్గొననున్నట్లు తెలిపారు.



రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థి చరణ్‌తో ఉపాధ్యాయులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన అక్షితతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు అంబటిపల్లి విద్యార్థి

లింగాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు అక్షిత అనే విద్యార్థిని ఎంపికైనట్లు అంబటిపల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు నిరంజన్ తెలిపారు. నారాయణపేట జిల్లా మద్దూరు మండలంలో జరిగిన ఉమ్మడి జిల్లా 69వ ఎస్‌జీఎఫ్ అండర్-17బాలికల విభాగం కబడ్డీ క్రీడల్లో లింగాల మండలం అంబటిపల్లి హై స్కూల్‌లో 9వతరగతి చదువుతున్న డి.అక్షిత నాగర్‌కర్నూల్ జిల్లా తరఫున పాల్గొని ప్రావీణ్యం కనబరుస్తూ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వెల్లడించారు. మెరుగైన రీతిలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రాతినిథ్యం వహించనున్న అక్షితను పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం నిరంజన్, పీడీ నరేందర్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు.

క్రీడలతో ఆత్మవిశ్వాసం

» మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి

» జోనల్ లెవల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ప్రారంభం



చిట్టబోయిన్‌పల్లి సాంఘిక, సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న ఎస్పీ జానకి

జడ్చర్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో విద్యార్థులకు క్రమశిక్షణ అలవరుతుందని, ఓర్పుతో జట్టుగా పనిచేయడం అలవాటవుతుందని, తద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుందని మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి అన్నారు. జడ్చర్ల మండలంలోని చిట్టబోయిన్‌పల్లి సాంఘిక, సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న తెలంగాణ సోషల్‌వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ సొసైటీ 11వ జోనల్ లెవల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌ను గురువారం ఆమె క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ తాను కూడా గురుకుల పాఠశాలలోనే చదువుకున్నానని, హ్యాండ్‌బాల్ ఆడేదానినని గుర్తుచేసుకున్నారు. విద్యార్థినులు అన్ని రంగాలలో ముందంజలో ఉండాలని సూచించారు.

ఈ క్రీడాత్సోవంలో మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల, నారాయణపేట జిల్లాలలోని వివిధ సాంఘిక, సంక్షేమ గురుకుల పాఠశాలల విద్యార్థినులు 935 మంది పాల్గొన్నారు. వారికి అథ్లెటిక్స్‌తో పాటు కబడ్డీ, ఖోఖో, హ్యాండ్‌బాల్, వాలీబాల్, టెన్నికాయిట్‌తో పాటు, చెస్, క్యారమ్స్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అనిత, జోనల్ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ షంషేర్‌అలీ, పీఈటీ శరణ్య, ఉపాధ్యాయులు రాజేశ్వరి, భవాని, శ్రీదేవిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రేపు యోగా జట్టు రిపోర్టు చేయాలి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లాలో ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 8న రిపోర్టు చేయాలని జిల్లా యోగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాములు, బాలరాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు స్టేడియం మైదానంలో సంబంధిత పత్రాలు కోచ్‌కు అందజేయాలని కోరారు.

ఉపాధి హామీ పనులపై గ్రామ సభ

హన్వాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దదర్పల్లి గ్రామంలో గురువారం ఉపాధి హామీ పథకం పనుల గుర్తింపు గ్రామ సభ నిర్వహించారు. ఉపాధి సిబ్బంది, గ్రామ కార్యదర్శి, వివిధ పార్టీల నాయకులు, కూలీలు పాల్గొని పనుల వివరాలు నమోదు చేశారు. గ్రామంలో 2026-27 సంబంధించిన పనులను చర్చించారు. రైతులకు కావలసిన పనులు గుర్తించాలని బీజేపీ మండల నాయకుడు రఘురాంగౌడ్ సూచించారు.

టీపీసీసీ ఎస్సీ సెల్ లీగల్ కన్వీనర్‌గా లక్ష్మీనారాయణ

జడ్చర్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ లీగల్ కన్వీనర్‌గా జడ్చర్లకు చెందిన న్యాయవాది లక్ష్మీనారాయణను నియమించారు. అందుకు సంబంధించిన ఉత్తర్వులను ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ నగరి గారి ప్రీతమ్ జారీ చేయగా, గురువారం ఉత్తర్వులు అందుకున్నట్లు లక్ష్మీనారాయణ తెలిపారు.

రేపటి నుంచి పౌర హక్కుల రాష్ట్ర మహా సభలు

పాలమూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 8, 9వ తేదీల్లో హైదరాబాద్‌లో పౌరహక్కుల సంఘం రాష్ట్ర మహా సభలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ప్రజాఫ్రంట్ ఉమ్మడి జిల్లా సమన్వయకర్త బుచ్చారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మేధావులు, ప్రజలు పౌర హక్కుల రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో ఆపరేషన్ కగార్ లాంటి రాజ్యహింసలతో ప్రజలకు జవాబుదారితనం లేకుండా ధనవంతులు, బలవంతుల రాజ్యహింస రాజ్యమేలుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కేంద్ర ఆపరేషన్ కగార్‌ను ఆపాలన్నారు.


మైనార్టీ సంక్షేమ శాఖాధికారిగా ఇందిర

మహబూబ్‌నగర్ అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిణిగా ఇందిర గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణిగా పని చేస్తున్న ఆమెకు మైనార్టీ సంక్షేమ శాఖాధికారిగా పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించారు. జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారిగా విధులు నిర్వహించిన శంకరచారి గత నెల 31 రిటైర్డ్ అయ్యారు. ఈ సందర్భంగా జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిణి ఇందిర మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసే మైనార్టీ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చేస్తానన్నారు. ఉర్దూ అధికారి మునీబ్ ఆఫాఖ్, ఉద్యోగులు మొగులయ్య, షానవాజ్ బేగం, ఇర్ఫాన్, అబ్దుల్ కరీం పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారంతో మభ్యపెడుతున్న కాంగ్రెస్

మిడ్జిల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన కింద దేశ వ్యాప్తంగా పేదలందరికీ కేంద్ర ప్రభుత్వం 5 కిలోల ఉచిత ఆహార ధాన్యాలు అందిస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం కేవలం కిలో మాత్రమే ఇస్తూ ప్రజలను మభ్య పెడుతుందని బీజేపీ నాయకులు విమర్శించారు. ప్రభుత్వం చేపడుతున్న తప్పుడు ప్రచారాలు మానుకోవాలని బీజేపీ మండలాధ్యక్షుడు నరేష్‌నాయక్ ఆధ్వర్యంలో తహసీల్దార్ రాజుకు గురువారం వినతిపత్రం అందజేశారు. బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి రాజేశ్వర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి, నాయకులు నరేందర్, శేఖర్, వెంకటరెడ్డి, ఎల్లయ్య, దేవేందర్, భీమయ్య, వెంకటయ్య, బుచ్చయ్య, జంగయ్య, నవీన్, మధు, బీర్ల శేఖర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ సుదర్శన్‌గౌడ్

జడ్చర్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బాదేపల్లి పత్తి మార్కెట్‌లో గురువారం బాదేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ సుదర్శన్‌గౌడ్ ప్రారంభించి, మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యంను ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించుకోవాలని సూచించారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి, వైస్‌చైర్మన్ రాజేందర్‌గౌడ్, మునిసిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, నాయకులు వెంకటేష్, జనార్దన్‌రెడ్డి, లక్ష్మయ్య, సుధాకర్‌రెడ్డి, ఏవో గోపీనాథ్, పీఏసీఎస్ మానిటరింగ్ అధికారి సాదత్‌అలి పాల్గొన్నారు.

నాలా పర్మిషన్ ఎలా ఇస్తారు?

» తహసీల్దార్ కార్యాలయం ఎదుట గ్రామస్థుల ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్థులు

మహమ్మదాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మహమ్మదాబాద్ నడి బొడ్డున ఉన్న గ్రామ కంఠం భూమిలో 1992లో నవజీవన రీక్రియేషన్ క్లబ్ నిర్మించగా, అప్పటి రెవెన్యూ మంత్రి స్వర్గీయ కమతం రాంరెడ్డి ప్రారంభించారు. ఆ భవనాన్ని పడగొట్టి ఆ భూమికి నాలా పరిష్మన్ ఎలా ఇస్తారని మాజీ సర్పంచ్ గుర్రం రాజేశ్వర్, నాయకులు దిడ్డికాడి గోపాల్ మండిపడ్డారు. గురువారం వివిధ పార్టీ నాయకులు, గ్రామస్థులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట మూడు గంటల పాటు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామం మధ్యలో వ్యవసాయ భూమి ఎలా ఉందని, అక్కడ ఉన్న స్థలానికి నాలా పర్మీషన్ ఎలా ఇచ్చారని తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది తీరుపై మండిపడ్డారు. ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రీ క్రియేషన్ క్లబ్ భవనాన్ని పడగొట్టి అక్కడ కొందరు వ్యక్తులు ఇళ్లు నిర్మిస్తుటే అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారో చెప్పాలన్నారు. పనులు ఆపకుంటే గ్రామస్థులే పనులు అడ్డుకుంటామని హెచ్చరించారు. అక్కడ పనులు ఆపితేనే ఇక్కడి నుంచి కదులుతామని పట్టుపట్టగా, తహసీల్దార్, ఎస్‌ఐ వారికి సర్దిచెప్పి పంపారు. పవన్‌కమార్, సాబేర్, గోపాల్‌రెడ్డి, కేశవులు, గోపాల్, దస్తయ్య, కృష్ణ, శ్రీశైలం, గోపాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాదాసి కురువలకు ఎస్సీ సర్టిఫికెట్ ఇవ్వాలి

» తహసీల్దార్‌కు వినతి పత్రం అందించిన నాయకులు



వినతి పత్రం ఇస్తున్న మాదాసి కురువలు

భూత్పూర్/హన్వాడ/మహబూబ్‌నగర్ రూరల్/దేవరకద్ర, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మాదాసి కురువలకు ఎస్సీ సర్టిఫికెట్ జారీ చేయాలని కోరుతూ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మాదాసి కురువ సంఘం నాయకులు గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కిషన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాదాసి కురువ సంఘం నాయకుడు ఎర్రవాపు నర్సిములు మాట్లాడుతూ దేశంలో చాలా రాష్ట్రాల్లో మాదాసి కురువలకు ఎస్సీ సర్టిఫికెట్ జారీ చేస్తున్నారని, మన రాష్ట్రంలో మాత్రం కొన్ని ప్రాంతాల్లో అధికారులు ఎస్సీ సర్టిఫికెటు జారీ చేయడం లేదన్నారు. ఈనెల 12న ఆర్డీవోకు, 17న కలెక్టర్‌కు, 24న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వినతి పత్రాలు అందిస్తామని తెలిపారు. ఆంజనేయులు, రాజమల్లయ్య, లింగం, కర్నే మల్లేష్, మశ్చందర్, వీరస్వామి, శ్రీనివాసులు, నరేందర్, వెంకటేష్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సాయిలు పాల్గొన్నారు. అదే విధంగా హన్వాడ మండల కేంద్రంలో మాదాసి కురువలకు ఎస్సీ సర్టిఫికెట్ జారీ చేయాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. నాయకులు భీమయ్య, వెంకటేష్, నర్సింహులు, వెంకటయ్య, మల్లయ్య, శివ, తిరుపతయ్య, మల్లేష్ పాల్గొన్నారు. మహబూబ్‌నగర్ రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. మండల ప్రధాన కార్యదర్శి, ఆంజనేయులు, వెంకటస్వామి పాల్గొన్నారు. దేవరకద్ర మండల కేంద్రంలో తహసీల్దార్‌కు మాదాసి, మాదారి కురువలు వినతిపత్రం అందజేశారు.

అజాగ్రత్తతోనే సైబర్ నేరాలు : ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ జానకి

జడ్చర్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అజాగ్రత్తతోనే సైబర్ నేరాలు జరుగుతున్నాయని, సైబర్ నేరాలు పెరుగుతున్న తరుణంలో ప్రతీ ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని ఎస్పీ జానకి సూచించారు. బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో గురువారం సైబర్‌నేరాలపై నిర్వహించిన అవగాహన శిబిరంలో ఆమె మాట్లాడారు. డిజిటల్ అరెస్టులు ఉండవని తెలిపారు. సోషల్ మీడియాలలో ఫేక్ ట్రేడింగ్ ప్లాట్‌ఫాంలతో వల వేస్తారన్నారు. పార్ట్‌టైమ్ ఉద్యోగాలు కల్పిస్తామంటూ సైబర్ నేరాలకు పాల్పడుతారని వివరించారు. బ్యాంకింగ్ సేవల పేరుతో ఓటీపీలతో సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రతీ లింకును ఓపెన్ చేయవద్దని, ముఖ్యంగా ఏపీకే ఫైల్స్‌తో హ్యాకింగ్‌కు పాల్పడి, బ్యాంకు ఖాతాలో ఉన్న డబ్బులు కాజేస్తారని వివరించారు. ఏదైన సైబర్ నేరం జరిగిన వెంటనే ప్రభుత్వ వెబ్‌సైట్ ద్వారా లేదా టోల్‌ఫ్రీ నెంబరు 1930కు, వాట్సాప్ నెంబరు 8712672222 సమాచారం ఇవ్వాలన్నారు. బాదేపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి, వైస్ చైర్మన్ రాజేందర్‌గౌడ్, మునిసిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, కౌన్సిలర్ లలిత, మహిళ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సైబర్‌క్రైమ్ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్ పాల్గొన్నారు.

● బాలానగర్ / గండీడ్ : సైబర్ నేరాలపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ లెనిన్ తెలిపారు. గురువారం మండలంలోని గుండేడ్‌లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. గండీడ్ మండల కేంద్రంలో ఎస్‌ఐ కృష్ణాజీ సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. హెడ్ కానిస్టేబుల్ నారాయణ, పోలీసులు ఆనంద్, రవికుమార్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అలవర్చుకోవాలి



మిడ్జిల్ పాఠశాల ఆవరణలో ఇంకుడుగుంతను ప్రారంభిస్తున్న ప్రతినిధులు, ఉపాధ్యాయులు


భూత్పూర్/మిడ్జిల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యాశాఖ, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో యంగ్ ఎర్త్ లీడర్స్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని వెల్కిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మిడ్జిల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పర్యావర పరిరక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలు, ఔషధ, కూరగాయల తోటల పెంపకం, వర్మీ కంపోస్టు ఎరువుల తయారీ విధానం వంటి వాటిని (సీజీఏఆర్) కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ రాష్ట్ర ప్రతినిధులు రమేష్‌రావు, మహ్మద్ రఫీయోద్దీన్ పాఠశాల ఉపాధ్యాయుల బృందం కలిసి ప్రారంభించారు. ప్లాస్టిక్ మహ్మమారి నుంచి పుడమి తల్లి కాపాకుందామని రమేష్‌రావు విద్యార్థులకు సూచించారు. భారతదేశం ఔషధ మొక్కల పెంపకంలో పుట్టినిల్లు వంటిదని మహ్మద్ రఫీయోద్దీన్ అన్నారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం చెన్నయ్య, కృష్ణకుమార్, ఉపాధ్యాయులు బాల్‌లింగయ్య, మంజుల, సుమిత్ర, మమత, హరిశ్వర్‌రెడ్డి, నవీన్, రాజేష్, మణికంఠ, చరణ్, వెంకటరెడ్డి, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్లు రజనీకాంత్, మద్దిలేటి పాల్గొన్నారు.

లింగంపల్లిలో ఎంపీడీవో పర్యటన

నవాబ్‌పేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగంపల్లి గ్రామంలో గురువారం ఎంపీడీవో జయరాములు పర్యటించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ, పాఠశాల, సబ్‌సెంటర్ ప్రభుత్వ కార్యాలయాలు తనిఖీ చేశారు. ప్రజలకు ఇబ్బందులు రాకుండా డిపార్ట్‌మెంట్ల వారిగా అధికారులు తమ శాఖల పరిధిలో సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యదర్శి శ్వేత ఉన్నారు.

కోర్టు ఉత్తర్వుల ప్రకారం చర్యలు

» మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

మహబూబ్‌నగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు నగరంలోని డీఈవో కార్యాలయం చౌరస్తాలో ఏర్పాటు చేసిన సూపర్ స్టార్ కృష్ణ విగ్రహం ముందు నుంచి వివాదాస్పదంగా మారింది. సామాజిక కార్యకర్త దిడ్డి ప్రవీణ్‌కుమార్ సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా విగ్రహం ఏర్పాటు చేశారని హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు విగ్రహ ఏర్పాటు, అనుమతులపై విచారణ చేయాల్సిందిగా మునిసిపల్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించడంతో గురువారం కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తన కార్యాలయంలో విచారణ చేపట్టారు. కోర్టును ఆశ్రయించిన నేను సైతం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌తో పాటు అధికారులు విచారణలో పాల్గొన్నారు. కృష్ణ అభిమానుల సంఘం అధ్యక్షుడు రమేష్‌బాబు విచారణకు గైర్హాజరయ్యారు. అనంతరం కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సినీ నటుడు కృష్ణ విగ్రహం ఏర్పాటు చేయరాదని అప్పుడున్న కమిషనర్ నోటీసు ఇచ్చారన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు అనుమతి లేకుండా విగ్రహం నెలకొల్పారన్న విషయమై విచారణ చేపట్టామన్నారు. దీనిపై ఉన్నతాధికారులను సంప్రదించి విగ్రహం ఉంచాలా? తొలగించాలా? అన్న విషయంపై త్వరలోనే చర్యలు తీసుకుంటామన్నారు. కృష్ణ అభిమానుల సంఘం అధ్యక్షుడికి విచారణకు హాజరుకావాల్సిందిగా నోటీసు ఇచ్చినా హాజరు కాలేదని, అందుకు కారణాలు తమకు తెలుపలేదన్నారు.

డబుల్ ఓట్లను తొలగించాలి

గండీడ్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : డబుల్ ఓట్లను తొలగించి సరిచేయాలని తహసీల్దార్ మల్లికార్జునరావు అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలక్టోల్ మ్యాపింగ్ సిస్టం అనుసంధానం ద్వారా 2002 నుంచి 2025 వరకు ఉన్న డబుల్ ఓట్లను తొలగించాలన్నారు. ఆర్‌ఐ యాసిన్, సీనియర్ అసిస్టెంట్ అనిరుధ్‌రెడ్డి, సూపర్‌వైజర్ మంగమ్మ పాల్గొన్నారు.

చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని చేస్తున్న కుట్రలు, అబద్ధ ప్రచారాలను నిరసిస్తూ గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఈనెల 8న చేపట్టిన చలో ఢిల్లీ పోస్టర్‌ను మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే విజయుడు, నాయకులు రవీందర్‌యాదవ్, గిరిజన విద్యార్థి సంఘాల నాయకులు ఆవిష్కరించారు. గిరిజన విద్యార్థి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్‌నాయక్, మోహన్‌నాయక్, మారుతి, యాదయ్య, బాలరాజు, కేశవులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు భారీగా మొక్కజొన్న

నవాబ్‌పేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బాలాజీ మార్కెట్ యార్డుకు గురువారం మొక్కజొన్న భారీగా తరలివచ్చింది. 4114 బస్తాలు (2057 క్వింటాళ్లు) రాగా, క్వింటాలుకు గరిష్ఠంగా రూ.2,057, కనిష్ఠంగా రూ.1,503 పలికినట్లు మార్కెట్ కార్యదర్శి రమేష్ తెలిపారు.

● దేవరకద్ర : దేవరకద్ర మార్కెట్‌కు గురువారం పెద్ద హంస 308 క్వింటాళ్లు విక్రయానికి రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.1759, కనిష్ఠంగా రూ.1,740 పలికినట్లు మార్కెట్ అధికారి జయశ్రీ తెలిపారు. అదే విధంగా ఆర్‌ఎస్‌ఆర్ 2801 క్వింటాళ్లు రాగా, క్వింటాలుకు గరిష్ఠంగా రూ.2,169, కనిష్ఠంగా రూ.2,035, పెద్దసోన గరిష్ఠంగా రూ.2,109, కనిష్ఠంగా రూ.2,103, పలికింది.

విద్యార్థులు బాగా చదవాలి

పాలమూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు బాగా చదిని అభివృద్ధిలోకి రావాలని శ్రేయాభిసంస్థ చైర్మన్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. గురువారం పట్టణంలోని టీచర్స్ కాలనీలో ఓక్సీ టెక్నాలజి ప్రైవేట్ ట్రైయినింగ్ సెంటర్‌లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, ఐటీ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న యువతకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. యువతీ యువకులు తమ స్కిల్స్ పెంచుకుని సాఫ్ట్‌స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టు సాధించాలని దీనికి ఓక్సీ ట్రైనింగ్ సెంటర్ నుంచి పట్టణంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

గండీడ్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రజాపాలనలో అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సల్కర్‌పేట్‌లో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ అందజేసి, భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. పంచాయతీ కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

జడ్చర్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీ నాగసాల సమీపంలోని మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థిని, ఓ ఉపాధ్యాయుడు చితకబాదిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. 7వ తరగతి చదువుతున్న అలీ అనే విద్యార్థిని పీఈటీ చితకబాధడంతో సమాచారం అందుకున్న తల్లిదండ్రులు, పాఠశాల ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేయగా, ఉపాధ్యాయులు సర్దిచెప్పడంతో విరమించుకున్నారు. ఈ సంఘటన బయటికి పొక్కకుండా జాగ్రత్తలు చేపట్టారు.

బీసీల మౌనాన్ని పరీక్షించొద్దు

» మౌన దీక్షలో బీసీ జేఏసీ చైర్మన్ బెక్కెం జనార్దన్



మౌనదీక్ష చేపట్టిన బీసీ సంఘాల ప్రతినిధులు

పాలమూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బీసీలు సముద్రంలా మౌనంగా ఉన్నారని, తమకు జరుగుతున్న అన్యాయంపై తిరగబడి తుఫానులా మార్చకండని బీసీ జేఏసీ చైర్మన్ బెక్కెం జనార్దన్ హెచ్చరించారు. గురువారం జిల్లా కేంద్రంలో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 'మౌనదీక్ష' చేపట్టారు. పద్మావతి కాలనీలోని బీపీ మండల్, జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాల వేసి మౌనదీక్ష చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో సగం కంటే ఎక్కువ బీసీలు సముద్రంలా ప్రశాంతంగా ఉన్నారని, కానీ తిరుగుబాటు చేస్తే ఉప్పెనలా ఉంటుందన్నారు. జిల్లా క్లబ్ కార్యదర్శి, పీసీసీ కార్యదర్శి సంజీవ్ ముదిరాజు మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్‌కు కట్టుబడి అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మాణం చేశామని, అన్ని పార్టీలు అమోదించినా కేంద్రం పెండింగ్‌లో పెట్టటం భావ్యం కాదన్నారు. మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌గౌడ్, బీసీ జేఏసీ వైస్ చైర్మన్ మున్నూరు రాజు, కన్వీనర్లు శ్రీనివాసులు, విజయకుమార్, సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, రమేష్‌గౌడ్, శివరాజు, మైత్రి యాదయ్య, సుధాకర్, సత్యం, సాయిలు యాదవ్, రమేష్, మల్లికార్జున్, బుగ్గన్న, రవీందర్‌రాజు, తాయప్ప, శ్రీనివాసు, అంజనేయులు పాల్గొన్నారు.

గ్రామ సంఘాలను బలోపేతం చేద్దాం



భూత్పూర్ మహిళా సమాఖ్య మహిళలతో మాట్లాడుతున్న క్రిష్టినా

భూత్పూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఉన్న మహిళా సంఘాలను బలోపేతం చేసి, వాటిని అభివృద్ధి బాటలో నడిచేలా మండల సమాఖ్య చొరవ తీసుకోవాలని జిల్లా ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ క్రిష్టినా సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి, అన్ని విభాగాలను పరిశీలించారు. వాటి పనితీరును సంబంధిత శాఖ అధికారులతో అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో జరిగే పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును పరిశీలించి, మహిళా సమాఖ్య కార్యాలయంలో ప్రతీ నెల జరిగే సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలకు ప్రభుత్వం నుంచి మంజూరవుతున్న వివిధ రుణాలతో పాటు వివిధ గ్రామాల నుంచి వచ్చిన మహిళా సంఘాల వారితో వారి గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలు ఎంత వరకు వినియోగించుకుంటున్నారు? రుణాలను సకాలంలో చెల్లిస్తున్నారా? సకాలంలో చెల్లించకపోవడానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. సమాఖ్య ఆధ్వర్యంలో అద్దెకు ఆర్టీసీ బస్సు ఇవ్వడం సంతోషంగా ఉందని మండల మహిళా సమాఖ్యను అభినందించారు. ఏపీఎం సుధీర్‌కుమార్, మహిళా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి న్యాయమూర్తి కళ్యాణ్‌చక్రవర్తి

మహబూబ్‌నగర్ నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో వెనకబడిన వారికి మహిళలు, అభాగ్యులకు ఉచిత న్యాయ సహాయం, న్యాయ సలహాలు అందిస్తామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి న్యాయమూర్తి కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. ఈనెల 9న దేశ వ్యాప్తంగా లీగల్ సర్వీసెస్ డే జరుపుకుంటున్నామన్నారు. గురువారం జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు ఉచిత న్యాయ సహాయం, న్యాయ అవగాహనతో పాటు వారి హక్కులు తెలియజేయడం లక్ష్యంగా న్యాయసేవాధికార సంస్థ పనిచేయడం జరుగుతుందన్నారు. ఎస్పీ జానకి మాట్లాడుతూ లోక్‌అదాలత్ కార్యక్రమానికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. పీఎల్‌వీ డొనేట్ చేసిన వీల్‌ఛైర్‌ను డీఎల్ఎస్ఏ చేతుల మీదుగా లబ్దిదారులకు అందజేశారు. న్యాయమూర్తులు శ్రీదేవి, రాధిక, రవిశంకర్, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి పాల్గొన్నారు.

ప్రజాబాటలో విద్యుత్ అధికారులు

పాలమూరు/రాజాపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజాబాటలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని శివశక్తినగర్‌తో పాటు పలు కాలనీలు, రూరల్ పరిధిలోని పలు గ్రామాలతో పాటు రాజాపూర్ మండలంలో ఎస్ఈ వెంకటరమేష్, డీఈ నవీన్‌కుమార్, ఏడీ థౌర్యా నాయక్, ఏఈ హరినాథాచారి, డీఈ చంద్రమౌళి, ఏఈ వెంకటేష్, లైన్ ఇన్స్‌పెక్టర్ హుస్సైన్ సిబ్బందితో కలిసి విద్యుత్ అధికారులు పర్యటించారు. పట్టణంలోని పలుచోట్ల లోఓల్టేజీ సమస్య ఉందనే కారణంతో డీటీఆర్‌ను పోల్ మౌంటెండ్ (కాంటిలెవర్ అరేంజ్‌మెంట్)లో ఏర్పాటు చేశారు. రూరల్ పరిధిలోని అల్లీపూర్‌లో రూరల్ ఏడీఈ డీఎస్ మద్దిలేటి, ఏఈ నర్సిరెడ్డి బృందం పర్యటించి సమస్యలను గుర్తించారు. కాలం తీరిన పోల్స్, లోఓల్టేజీ సమస్య, తీగలకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మల కత్తిరింపు సమస్యలు గుర్తించినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో ఎస్ఈ, డీఈ, ఏడీఈల ఆధ్వర్యంలో క్రిస్టియన్ కాలనీ, పర్యటించి సమస్యలు గుర్తించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

మహబూబ్‌నగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నగరం, పట్టణాల్లో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఈ కార్యక్రమం చేపడుతుందని, లబ్ధిదారులకు త్వరగా నిర్మాణాలు చేపట్టేలా అవగాహన కల్పించాలన్నారు. గురువారం మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మహబూబ్‌నగర్, జడ్చర్ల, భూత్పూర్ కమిషనర్లు, అధికారులతో సమీక్షించారు. అభివృద్ధి కార్యక్రమాలు ఆగరాదని, అదే సమయంలో మునిసిపాలిటీలకు రావలసిన ఆదాయంపై దృష్టి సారించాలన్నారు. ఆస్తి పన్ను వందశాతం వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని, అద్దె దుకాణాల అద్దెలు, బకాయిలు వసూలు చేయాలని ఆదేశించారు. వాటర్ ఛార్జెస్ కూడా పూర్తిస్థాయిలో వసూలు చేయాలన్నారు.

చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

మిడ్జిల్/రాజాపూర్ నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జెడ్పీహెచ్ఎస్, అయ్యవారిపల్లి, మిడ్జిల్ పాఠశాలలతో పాటు రాజాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్-2025 పోస్టర్లను జీహెచ్ఎం సుధాకర్, ఇన్‌చార్జి హెచ్‌ఎం కృష్ణకుమార్, ఎంఈవో సుధాకర్, హెచ్‌ఎం ఇబ్రహీం, టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు వెంకటయ్యతో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ ధృక్పథం పెంపే లక్ష్యంగా మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సైన్స్ ఉపాధ్యాయులు 8వ, 9వ, 10వ తరగతి విద్యార్థులందరూ పరీక్ష రాసేలా చూడాలని సూచించారు. 12న పాఠశాల స్థాయి, 21న మండల స్థాయి, 28న జిల్లా స్థాయి, డిసెంబరు 12, 14న రాష్ట్ర స్థాయిలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక మండల ఇన్‌చార్జి వెంకటయ్య, శ్రీశైలం, రాజేందర్‌గౌడ్, అనంతరెడ్డి, ప్రణేష్‌రావు, మహేంద్రమ్మ, రాజలక్ష్మి, వెంకట్‌రామ్ రెడ్డి, శ్యామ్‌సుందర్, హనుమప్ప, ఎల్లయ్య, సంజీవరెడ్డి, శ్రీనివాసులు, అరుంధతి, వెంకటమ్మ పాల్గొన్నారు.